


# దేవి యిచ్చిన వరం

✽

[ కథానిక ]

శ్రీ కపిల చినవేంకటరావు

(గత సంచికతరువాయి)

●

వెంటనే భళ్లున తెల్లవారింది. కలకలా రవములు చేస్తూ పక్షులు ఎగురుతున్నాయి. గాలి నెమ్మదిగా వీస్తోంది. పశువులు అరుస్తున్నాయి. తూర్పుదిక్కున సూర్యబింబము కరకర ఉదయిస్తోంది. ఎర్రని వెలుతురులో స్టేషనూ, మాస్టరుగారి యిల్లూ ఎర్రగా కనబడుతున్నాయి. ఒకళ్లొకళ్లే లేచి జనులు ఎవరిపనులమీదికి వాళ్లు పోవడానికి సర్దుకుంటున్నారు. తెల్లవారి వచ్చే మెయిలు ఎక్కడంకోసం కాబోలు కొందరు జనం విసవిస నడిచి వస్తున్నారు స్టేషనుకి.

"అంతా చీకటి కావాలి" అన్నాడు శరభన్న.

జిమ్ముకుంటూ చీకటి వచ్చిపడింది. కన్నుపొడుచుకున్నా కానరాని చీకటి! నక్షత్రాల వెలుతురుకూడా రాకుండా మబ్బులు. ప్రపంచ మంతా కారుచీకటి క్రమ్మింది.

శరభన్న లేచి సత్రంబయటికి వచ్చాడు. చీకట్లో ఆ పాతసత్రం వికారంగా కనపడుతోంది. ఎన్నాళ్ల క్రిందట యే మహారాజు కట్టించాడో అది, తిరిగీ దానిమొహం చూచినవాళ్లు లేకపోబట్టి పెణకలు కూలి, చవుడు డుల్లి, పాతబడి, పాడుబడిఉంది. అక్కడక్కడ తలుపులు చెదలు తినడంచేత క్షేమం తక్కువైపోయింది. రైలుమాస్టరుగారిల్లూ, మరినాలుగు పూరికొంపలూ తప్ప వేరేమీ లేని ఆ నిర్జనప్రదేశంలో దొంగల భయంచేత ఈ పాడుసత్రంలోకి రావడమే మానేశారు యాత్రికప్రజ.

ఆసత్రం చూస్తే శరభన్నకి అసహ్యం వేసింది. "వెధవసత్రం, తగలడితే బాగుండును" అనుకున్నాడు.

ఏ మూల అంటుకుందో మరి, ఒక్క నిముషంలో సత్రం అంతటా పాకింది అగ్ని. పాత కలప కావడంచేత అన్ని మూలలా అన్నిమంటలూ లేచి దహించడం మొదలుపెట్టాయి. ఫెటఫెట మని ధ్వనులు చేస్తూ పాతదూలాలుమండి చెవులుపగిలేట్టు చప్పుడు చేస్తూ పగులుతున్నాయి. నల్లటి పొగలు ఆకాశంనిండా క్రమ్ముతున్నాయి. పెద్దపెద్ద పాములలాగు నాలుకలు చాస్తూ మంటలు బ్రహ్మాండంగా రేగుతున్నాయి. ఆ శబ్దమూ, ఆ హడావిడీ విని, ఆ చుట్టు ప్రక్కల ఉన్న కొద్దిజనం పరుగెత్తుకుంటూ వచ్చారు

"అయ్యయ్యో! సత్రం కాలిపోతోంది, సత్రం కాలిపోతోంది" అని కేకలు వేసుకుంటూ. స్టేషనూ, మాస్టరుగారిల్లూ గట్టి కట్టడాలే అయినా మాస్టరుగారు తమ పశువులపాక ఎక్కడంటుకుంటుందో అని పరుగెత్తుకుని వెళ్లారు. తక్కినవాళ్లు తమ పూరికొంప లెక్కడ నాశన మవుతాయో అని వెళ్లారు. సత్రం ఆహుతి అయిపోతోంది.

శరభన్న వీళ్ల కంగారు చూచి నవ్వాడు. నవ్వితే ఒక ముత్రాసివాడు చెడామడా తిట్టాడు శరభన్నని—"సత్రం తగలడి పోతా వుంటే నవ్వుతావేటి శవింటి బాపనయ్యా!" అని. శరభన్నకి వినపడలే దామాట. ముత్రాసివాడు శరభన్నని చేతితో తట్టి మరీతిట్టాడు. మాటలు అర్థంచేసుకుని శరభన్న మళ్లీ నవ్వాడు. అతని కొక ఊహ తోచింది.

"సత్రం మళ్లీ ఎప్పటిలాగ ఉండాలి" అన్నాడు నిమ్మళంగా.

మంట లేమైనాయో, పొగ లెక్కడికి పోయాయో—ఆ పాతసత్రం మళ్లీ అక్కడ సిద్ధ మయింది. ఇందాకట్నుంచీ మంటలు చూస్తున్న వాళ్లంతా మళ్లీవచ్చిచూచి ఏమీ పాలుపోక, ఆఖరుకి కొరవిదయ్యాలనోల అని విడ్డూరంగా చెప్పుకుంటూ ఎవరికొంపకు వాళ్లు పోయారు.

కొన్నాళ్లు గడిచాయి. ఒకనాడు సత్రం చావడితలుపు దగ్గరగా వేసుకుని లోపల కూర్చొని శరభన్న సృష్టిలయాలు చేస్తున్నాడు. సత్రం ఏస్థితిలో ఉందో పరీక్షచేద్దామని ఎవరో పెద్దఅధికారి వచ్చాడు. ఆయన సత్రంకడకు అదేవేళ వచ్చి, "ఎవరయ్యా, గుమాస్తా, తలుపుతియ్యడేం?" అని కేక వేశాడు. శరభన్నకి ఆ కేక వినబడలేదు. అధికారి మెట్లెక్కివచ్చి తలుపు తన చేతి కర్రతో త్రోశాడు. లోపల తాను సృష్టించిన చేగోడీలు తింటూ శరభన్న మహానందంలో ఉన్నాడు. అధికారికి ఎంతకోప మయినా వచ్చింది. "బుద్ధి లేదురా? పిలుస్తుంటే పలుకవేం, చెవిటిమొద్దా" అని తిట్టాడు. శరభన్నకు అహంభావము కుతకుతలాడింది. "మన సత్తా వీడికి తెలియక మాట్లాడుతున్నాడు, వెధవ అధికారం వీడూను" అనుకొని అల్లాగే కూర్చున్నాడు. ఆ అధికారి కర్ర పుచ్చుకుని కొట్టాడు శరభన్నని. దెబ్బ తగలడంతోటే రేచిక్కెత్తుకు వచ్చి శరభన్న "చావు, వెధవా" అన్నాడు. పొట్టిగా, లావుగా ఉండి, సేలం అంచుపంచె, లాంగుకోటూ, జరీతలపాగతో ఉన్న ఆ అధికారి కర్ర చేతిలో పట్టుకుని ఉన్నవా డున్నట్టుగానే, ఆయనప్రాణం దేహంవదలి వెళ్లిపోయింది; కట్టె దభీలుమని క్రింద పడిపోయింది పెద్ద దుంగలాగ. లబలబ మని నెత్తికొట్టుకుంటూ పరుగెత్తుకుని వచ్చాడాయనబంట్రోతు. ఏం జెయ్యగలడు? స్టేషన్లో నలుగుర్ని పిలిచి, సాయం పట్టి శవం ఒకమూల పడుకోపెట్టి, అధికారి బంధువులకి టెలిగ్రాము ఇచ్చాడు.

ఆరోజల్లా శరభన్నకు మహాగ్రహంగా ఉంది. ఆ ఘటనతోటి అతనికి తన శక్తి యొక్క అపారత్వమున్నూ, అమోఘత్వమున్నూ బోధపడింది. అతని ముఖంలో ఒక విధమైన తీక్ష్ణత బయలుదేరింది. వెనుకటి చింతాపరత్వమూ, వైరాగ్యధోరణీ లేవు ఇప్పుడు. తీక్ష్ణత, ఒక విధమైన క్రౌర్యం!

మనిషి చస్తే మాటలా? అందులో అధికారికూడాను. పోలీసువారు సంజాయిషీలు తీసుకోవడానికి వచ్చారు. నూజివీడునుంచి ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టరూ, సబు మేజస్ట్రీటూ, అంతా వచ్చారు. సత్రంలో ఒక పెద్ద విచారణ జరిగింది. శరభన్న సాక్ష్యంకూడా విచారించారు. తనకేమీ తెలియదని చెప్పాడతను. చెప్పేటప్పుడు అతని మొహంమీద నవ్వు మొలకలెత్తడం చూచి పోలీసు ఇన్‌స్పెక్టరుగారు "నవ్వుతావేంరా? ఫూల్" అన్నాడు. శరభన్నకి వినపడింది ఈ తిట్టు. ఒళ్లు మండిపోయింది.

"పోలీసు ఇన్‌స్పెక్టరు చావాలి" అన్నాడు మనసులో.

పాతకుర్చీలో కూర్చున్నవాడు కూర్చున్నట్టుగా, కాకీలాగూ, కాకీకోటూ, జందెంలాగ తోలుపటకా, బెండుటోపీ, బూట్సులతో ఇన్‌స్పెక్టరుగారు సీల్గి చచ్చిపోయినాడు. మాట్లాడడంకోరకు ఆయన తెరచిన నోరు తెరచినట్టుగానే ఉంది. ప్రాణంపోయేటప్పుడు మాత్రం 'డప్పు' మని చప్పుడైంది. అంతే.

ఇంక ఆ విచారణసభలో కలిగిన అలజడి యేమనిచెప్పను! పులిమీదపుట్రలాగ, ఒక పెద్ద అధికారి హఠాత్తుగా చనిపోయినాడని విచారణకు వస్తే ఇంకొక అధికారి చావడమా? హఠాత్తుగానే చావడమా ఈయనకూడా? అదేవోటున? వాళ్ల గుండెలు పగిలిపోయా యనడంలో ఆశ్చర్యం యేమిటి? "రేపు వస్తా" నని చెప్పి సబుమేజస్ట్రీటుగారు నూజివీడు వెళ్లిపోయినాడు. ఇన్‌స్పెక్టరుగారి శవంకూడా లోగడ చనిపోయిన అధికారిశవంలాగే, కాపలాగా ఒక పోలీసుభటుణ్ణి ఉంచి, ఎక్కడికో పంపించేశారు.

అప్పటినుంచీ శరభన్నకు మనస్సులో భయమూ, సంకోచమూ పోయాయి. ఇప్పుడు శరభన్నకి చాటూ మాటూ లేదు. ఒకనాడు స్టేషనులోకివచ్చి నిలబడ్డాడు. మిఠాయి దుకాణంవాడిదగ్గరకు వచ్చి వాడి మిఠాయి తట్టలన్నీ మాయంచేశాడు వాడు మిఠాయి తింటే చేదుగా ఉండేటట్లు చేశాడు. వాడి పిల్లిని పక్షినిచేసి ఆకాశంమీద ఎగిరించాడు. ఆకాశంమీద ఎగిరే పక్షుల్ని మాటమాత్రం చేత క్రిందపడగొట్టాడు. స్టేషనుమాస్టరుగారి ఆవుని మార్చి కుక్కని చేశాడు. రైలుగేటు దగ్గర పడుకుని కూస్తోఉండే ఒక ముసిలి కుక్కను పిల్చి ఏనుగును చేశాడు. రైలు పట్టాలు నిలువునా నిలబెట్టాడు. స్టేషను యావత్తూ ఆ రెండు రైలుపట్టాలమీద నిలబెట్టాడు. మళ్లీ సత్రంలోకి వచ్చి కూర్చున్నాడు.

ఈ విపరీతాలు చేస్తున్నప్పుడు మొదటిలో ఆశ్చర్యపోయారు వాళ్లు. తరువాత భయంవేసింది వాళ్లకి. వీడే బహుశః ఆ ఉద్యోగస్థు లిద్దరిని చంపిఉంటాడని తోచింది వాళ్లకి. మనలని ఏంజేస్తాడో అని భయంవేసింది. శరభన్న అవతలికి పోగానే వాళ్లు వణుక్కుంటూ వణుక్కుంటూ నలుగురూ ఒకమూలచేరి వీణ్ణి మనం హత మారుస్తేనే గాని మనకు బ్రతికేఉపాయంలేదని నిశ్చయం చేసుకుని ఆవేళ రాత్రికే పెట్టుకున్నారు ఆముహూర్తం. ప్రాణభయం అంతచేయిస్తుంది కాబోలు!

రాత్రి సరిగా పన్నెండు గంటలకి చేరుకున్నారు వాళ్లంతా. చీకట్లో నల్లగుడ్డలు

ముసుగులు వేసుకొని గడ్డపార ఒకడు, పెద్ద కర్ర ఒకడు, గొడ్డలి ఒకడూ పట్టుకుని ముగ్గురు నడుస్తుంటే ముందు దారి చూపిస్తూ మిఠాయిదుకాణంవాడు నడిచాడు. వీళ్లు నలుగురూ సత్రంలోకి వెళ్లి నుంచున్నారు. హఠాత్తుగా తలుపుతీసుకొని, శరభన్న మీద అమాంతంగా పడి అతనిని కొట్టి పొడిచి చంపుదా మని వీళ్ల ఊహ. తలుపు పాతది, దాని మరలు త్రుప్పుపట్టిఉన్నాయి; త్వరగా రాలేదు. నలుగురూ బలంగా తోస్తే అది పెద్దచప్పుడుచేస్తూ విడిపోయింది. నలుగురూ ఒకదెబ్బని దూరారు లోపలికి.

తలుపు చప్పుడో, ఆయుర్దాయపు గట్టితనమో శరభన్నకు మెళుకువ తెచ్చింది. వెంటనే తెలిసిం దతనికి వీళ్ల ఉద్దేశం.

"చావండి వెధవల్లారా" అన్నాడు.

నాలుగు శవాలు! మొదళ్లు నరికిన అరటిచెట్లలాగ దబ్బుమని పడ్డాయి ఆ సత్రం గదిలో నాలుగు శవాలూను.

శరభన్న ఉగ్రుడైపోయినాడు. ఆవేశంగా బయటికి వచ్చి అక్కడ ఉండే మనుష్యుల్ని, పశువుల్ని, పక్షుల్ని, కీటకాదులన్నింటినీ ఒక్కశాపంలో నాశనంచేశాడు. రైలుపట్టాలను ఇంకొకచోటికి పంపేసి, స్టేషనును తగలబెట్టాడు. ఆ చుట్టుప్రక్కల అంతా ప్రసిద్ధి అయిపోయింది—అక్కడ ఒక బ్రహ్మరాక్షసుడు చేరాడని. అటువైపు ఒక్క పిట్టయినా పోవడంలేదు. ఇదివరకు జనపదములైనచోట్ల క్రమశః చెట్లుచేమలు పెరిగి పెద్ద అడవి అయిపోయింది. ఆ అడవిలో ఏకాకి శరభన్నతప్ప మరి మనిషిజాడ లేదు.

ఒకనాటి మధ్యాహ్నం వెనకటి వృద్ధ సన్యాసి మళ్లీ ఆదారినే వెడుతూ, పాతరస్తా కానక వెతుక్కున్నాడు. చెట్లు పెరిగి మాసిపోయిన పాతత్రోవను నడిచి ఆయన పూర్వం స్టేషను ఉన్నచోటికి వచ్చి చూస్తే అక్కడ పెద్ద తాడిఎత్తున పుట్ట ఒకటి పెరిగిఉంది. "దారి తప్పాను కాబోలు" అనుకుంటూ సన్యాసి అటువైపు చూస్తే సత్రంమాత్రం పాతది, పాడుపడి అల్లాగే ఉంది. "ఏమిటి ఈవిచిత్రం" అనుకుంటూ సన్యాసి అక్కడకు వెళ్లి అరుగుమీద కూర్చున్నాడు. కూర్చోగానే అతనికి ఒకవిధమైన భయం కలిగి అక్కడనుంచి లేచి లోపలికి వెళ్లిచూస్తే శరభన్న సావట్లో చాపమీద పడుకొని ఉన్నాడు. శరభన్నను చూడగానే గుర్తుపట్టి సన్యాసి అతనికి నమస్కారంచేసి నిల్చున్నాడు. శరభన్న నిరసనభావంతో లేచి కూర్చుని, "ఎవడ్రా నువ్వు? ఇక్కడకెందుకు వచ్చావురా?" అన్నాడు.

వృద్ధసన్యాసికి ఆశ్చర్యంవేసి తనలోతాను ఆలోచించుకుంటున్నాడు ఏమిటో. శరభన్న చీకాకుపడుతూ "ఎవడ్రా నువ్వు? మాటా పలుకూ లేదేం?" అన్నాడు. సన్యాసి నమస్కారంచేసి "మహాప్రభో, నేను ఒక సన్యాసిని" అన్నాడు.

శరభన్న చీదరించుకున్నాడు. "ఛీ, అవతలికి పో. సన్యాసికి ఇక్కడేంపని? పో, పో. అసలు మనిషి అన్నవాడిక్కడికి రావడానికి వల్లకాదు. పో" అన్నాడు.

ఆ సన్యాసికి ఏమిబోధపడిందో 'రాం రాం' చెప్పి బయటికి వచ్చేశాడు. వచ్చి వంటయింటివైపుకు ఎరిగిఉన్నవాడిలాగ వెళ్లి

అక్కడ గోడమీద గీచిఉన్న బొగ్గువిగ్రహం దగ్గర వృద్ధుడున్నూ, దేశద్రిమ్మరిన్నీ, సర్వసంగత్యాగిన్నీ అయిన ఆసన్యాసి సాష్టాంగపడి ప్రార్థనచేశాడు. ప్రార్థనానంతరం ఆయన ఆస్థలం విడిచిపెట్టి విసవిస నడుస్తూ తన దారిని తాను పోయినాడు.

మరికొన్నాళ్లు గడిచాయి. ఒకరోజున శరభన్నకి ఒళ్లంతా తపనపుట్టింది. మనసు కూడా ఏమీ బాగుండలేదు. మొదలు సంతృప్తి అనేదిలేదు అతనికి. అందువల్లనో, మరి నిజంగా దేహంలో అస్వాస్థ్యంవల్లనో అతి వేదన కలుగుతోంది. ఈమధ్య కొన్నాళ్ల నుంచి అది మెక్కువై, ఈవేళ మరీ ఎక్కువైంది. ఏమీ తోచడంలే దతనికి. కూచోలేడు; నుంచోలేడు, పడుకోలేడు, నిద్రపట్టదు, మరోపని చేయడానికి మనసు పుట్టదు.

పట్టపగలు పన్నెండుగంటలకి అర్థరాత్రి కావాలని ఉత్తరువుచేశాడు. వెంటనే చీకటి ముంచుకువచ్చి ప్రపంచ మంతా అంధకార బంధుర మయిపోయింది. ఎండపోయినా అతని తపన చల్లార లేదు. వెన్నెల వస్తే చల్లగా ఉంటుందని వెన్నెల కావా లనగానే పున్నమ వెన్నెల చక్కావచ్చింది. అందువల్లనూ అతనికి శాంతి కలుగలేదు. మంచిగంధం, మల్లెపువ్వులూ సృష్టించి తనకు తాను శైత్యోపచారాలు చేసుకున్నాడు.

ఏమీ లాభం లేకపోయింది. అంతలో అతనికి తోచింది చంద్రుడు చల్లదనమిస్తాడు కదా, చంద్రుడు మరీ దూరంగా ఉన్నాడు కాబట్టి పూర్తిగా చల్లదన మియ్యలేకుండా ఉన్నాడు, దగ్గరకు వస్తే బాగుంటుందని. వెంటనే శరభన్న ఉచ్చైస్స్వరంతో—

"చంద్రుడూ, భూమికి దగ్గరగా వచ్చెయ్యి" అన్నాడు.

ఆ వాక్కు శరభన్న నోట్లోనుంచి రావడం ఏమిటి, చంద్రమండలం గిర్రుగిర్రున తిరుగుతూ భూమండలం వైపు దిగడం ఏమిటి! ఒక శతలక్షకోటి రైలు ఇంజన్ల హోరు పుట్టింది. ఏమూలలనుంచో రంయి రంయి రంయిమని ఝంఝామారుతం దుమ్ముతో, ధూళితో, రాళ్లతో రేగింది. పండువెన్నెల పోయి, చిమ్మచీకటి అలుముకుంది. ఆచీకట్లో ఆ విపరీతపుగాలీ, ఆగాలికి ప్రపంచమంతా నాశనమైంది; తమంత లేసి ఊడలుదిగిన ముదిమర్రిచెట్లు సమూలంగా పెల్లగిలి పండుటాకుల్లాగ ఎగిరిపోతున్నాయి. కొండలు కదిలాయి. ఇకను మనుష్యమాత్రుడు కట్టిన మేడలూ మిద్దెలూ లెక్కఏమిటి? దీనికితోడు ఏనుగుతొండాలధారతో వర్షం. ధాం ధాం అంటూ చెవులు పగిలేధ్వనులతో ఉరుములు. వాటినిమించి జగతిని కంపింపజేసే పిడుగులు. కళ్లు గ్రుచ్చుకుపోయే మెరుపులు. ఆగాలి, ఆధ్వనీ! ప్రళయంవచ్చింది. ఇంతలోనే సముద్రాలు గట్లు తెగి భూమిమీద పడ్డాయి. ఒక్క చిటికెలో భూమినిండా నీరు ముంచుకు వచ్చింది. ఆదిశేషువు బుసకొట్టినట్లు బుసకొట్టుతూ, తెల్లగా నురుగులు కక్కుతూ, పదితాళ్ల ప్రమాణాన్ని మిడిసిపడుతూ, త్రుళ్లుతూ, అరుస్తూ వచ్చి జగత్తును కబళిస్తున్నది సముద్రం. క్రింద సముద్రం, పైని ప్రళయవర్షం. మేఘాలన్నీ తెగిపడ్డాయి కాబోలు, ఆగాలి, వాయుదేవుడికి వెర్రియెత్తింది కాబోలు, కులపర్వతాలే ఎగిరిపోతున్నాయి. ... ... ఆకాశంలోనుంచి మనోవేగంతో భూమివైపు వస్తున్న

ఆచంద్రుని గోళంలోనూ ఇంతే. దగ్గర కొచ్చినకొద్దీ చంద్రమండలం పెద్దదవు తోంది. తుదకి ఆకాశమంతా ఆక్రమించు కునేట్టుంది. వెలుతురూ లేదు, ఏమీ లేదు. ఎంత అందవికారంగా, ఎంత భయంకరంగా ఉంటుంది చంద్రబింబం! అక్కడకూడా చీకటే, అక్కడకూడా కొండలు కూలిపోతు న్నాయి. ఆ గమనవేగానికి చంద్రుడు వణికి పోతున్నాడు. భూమి చెప్పనే అక్కర్లేదు. క్షణానికి వెయ్యిమార్లు భూమికూడా వణికి పోతోంది. గజగజ గజగజ వణికిపోతోంది.

ఈ మహావిలయంలో శరభన్న పాత సత్రం కూలిపోయింది. గాలికి తాను ఎగిరి పోతున్నాడు. అతని యెట్టయెదుట సత్రం తాలూకు దూలాలు దూదిలాగ ఎగిరి పోయాయి. ఆకాశంమీదనుంచి వడగళ్లో, గాలిలోనుంచి రాళ్లో అతని నెత్తిమీద పడి గాయాలు చేస్తున్నాయి. అన్నిటిని మించి ఆ హోరు. ఒక్కటేహోరు, ఒక్కటే హోరు! ఏమీతోచదు, ఏమీ తెలియదు, ఎక్కడికి పోతాడు? ఎక్కడ తల దాచుకుంటాడు? చంద్రుడు ఇంకా దగ్గరకు వస్తున్నాడు. గిర్రు గిర్రున తిరుగుతున్న చంద్రమండలం వైపు చూస్తే కళ్లు తిరిగిపోతున్నాయి. చంద్ర మండలంలోనుంచి పెద్ద పెద్ద భాగాలు విరిగి పడిపోతున్నాయి. భూమిలోనూ అంతే. పెద్ద పెద్ద పెళ్లలు విరిగిపోతున్నాయి. గాలియొక్క ఒక్కఊపుతో ఎగిరి శరభన్న ఒక గోతికి కొట్టుకున్నాడు. ఆదెబ్బతోటి శరభన్నకి జ్ఞానం వచ్చింది. విశ్వప్రయత్నంచేసి మనస్సు బిగించుకుని—

"అమ్మా, నాకు వద్దు తల్లీ, ఈశక్తి. మళ్లీ ఎప్పటిలాగ ఉండనియ్యి నన్ను. ప్రపంచం మళ్లీ ఈశక్తి నాకు రాకపూర్వం ఉన్నట్లు చేసెయ్యి, తల్లీ!" అన్నాడు.

ఆప్రళయ మంతా టక్కున ఆగిపోయింది. ప్రపంచం మళ్లీ యథాస్థితికి వచ్చింది.

నూజివీడు రైల్వేస్టేషనూ, మిఠాయి దుకాణమూ, రైల్వేనౌకర్ల కొంపలూ, పాత సత్రం అన్నీ ఎప్పటిలాగున ఉన్నాయి.

చవితి చంద్రుడు ఉండీ లేనట్టుగా ఉన్నాడు. గుడ్డివెన్నెలలో లోక మంతా మసకమసకగా ఉంది. శరభన్న వంటచేసు కుంటున్నాడు. పొయ్యి మండడంలేదు. పొయ్యిలోనుంచి పొగ కళ్లలోకి పోయింది. శరభన్నకు మహాకోపం వచ్చింది. లేచి నుంచుని విసుగుకుంటూ, పైమీది గావంచాతో కళ్లు తుడుచుకున్నాడు. *

---

* ఇందులో ముఖ్యభావము సుప్రఖ్యాతులు హెచ్. జి. వెల్సుగారి ఏదో ఒక రచనలోనుండి తీసుకోవడమయినది.